ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

5

బుధవారం 14 ఆగస్టు 2024





త్రివర్ణ శోభితమైన కర్నూలు ఐకాన్..

కర్నూలు జిల్లా 78వ స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ప్రాచీన కట్టడాలు, ప్రభుత్వ కార్యాలయాలను అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజును త్రివర్ణ రంగులతో కూడిన లైటింగ్‌తో ఆకర్షనీయంగా తీర్చిదిద్దుతున్నారు. కర్నూలు నగరానికే ఐకాన్‌గా నిలిచే కొండారెడ్డి బురుజుకు ఏర్పాటు చేసిన త్రివర్ణ లైటింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో ప్రజలు రాత్రివేళ బురుజును తిలకించేందుకు తరలివస్తున్నారు. ముచ్చటైన మూడు రంగులు.. అశోక చక్రంతో ప్రజ్వరిల్లినట్లు ఉన్న కొండారెడ్డి బురుజు వీడియోను వాట్సాప్‌లలో షేర్ చేస్తూ స్టేటస్‌గా పెట్టుకుంటున్నారు.

- కర్నూలు న్యూసిటీ

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు



వాటర్ ఫౌంటెయిన్ అందాల వెనుక కొండారెడ్డి బురుజు సోయగం



సూక్ష్మ సేద్యానికి మహర్దశ

- ఉమ్మడి జిల్లాలో 30 వేల హెక్టార్లకు డ్రిప్పు
- జగన్ హయాంలో అటకెక్కిన పథకం

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 13: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వర్షాభావ పరిస్థితులు ఏటా ఎదుర్కొంటున్న కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలైన డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని తదితర నియోజకవర్గాల్లో భూగర్భజలమట్టం ఏటా తగ్గిపోతుండటంతో రైతులకు పంటల సాగు గగనమైపోతోంది. ఈ పరిస్థితుల్లో సూక్ష్మ సేద్యం విధానం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకుని రెండు సీజన్లలో పంటలు సాగు చేసేందుకు వీలున్న బిందు, తుంపర్ల సేద్యానికి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తి స్థాయిలో ప్రాధాన్యత దక్కింది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహకారంతో పాటు కొంత మొత్తాన్ని టీడీపీ ప్రభుత్వం కూడా రైతులకు సాయంగా అందించి పెద్ద ఎత్తున రాయలసీమలో కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సూక్ష్మ సేద్య విధానాన్ని అమలు చేసేందుకు పెద్ద ఎత్తున రైతులకు ప్రోత్సాహాన్ని అందించారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలకడంతో సూక్ష్మ సేద్యం అటకెక్కింది. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాతోనే గడిచిపోగా.. మిగిలిన చివరి మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం అరకొరగా..ఈ సూక్ష్మ సేద్యాన్ని అమలు చేసింది. కర్నూలు జిల్లాలో గత రెండేళ్ల నుంచి రైతుల పొలాల్లో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసినందుకు ఆయా కంపెనీలకు చెల్లించాల్సిన సుమారు రూ.60 కోట్ల మొత్తాన్ని చెల్లించకపోవడంతో డ్రిప్ కంపెనీలు మళ్లీ రైతుల పొలాల్లో డ్రిప్‌ను ఏర్పాటు చేసేందుకు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెద్ద ఎత్తున సూక్ష్మ సేద్యానికి బాటలు వేసే కార్యక్రమం మొదలైంది. కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 15 వేల హెక్టార్లు మొత్తం 30వేల హెక్టార్లలో ఈ సంవత్సరం డ్రిప్ పనిముట్లను ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ సంవత్సరం డ్రిప్ పరికరాలు అవసరమైన వారిని గుర్తించే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టేందుకు ఏపీఎంఐపీ అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులకు అవకాశం కల్పించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సూక్ష్మ సేద్య పథకాన్ని అమలు చేసేందుకు దాదాపు లక్ష హెక్టార్లు అనుకూలంగా ఉందని ఏపీఎంఐపీ అధికార వర్గాలు తెలిపాయి.

రాయితీ వివరాలు

ఐదెకరాలలోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం కింద 90 శాతం రాయితీ ఇస్తారు. 5 నుంచి 12.5 ఎకరాల్లోపు పొలం వున్న రైతులకు 50 శాతం రాయితీ ఇస్తారు. ఇక స్పింకర్ల ఏర్పాటుకు సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రిప్ పరికరాలు కావాలనుకునే రైతులు ఆధార్, భూమి యాజమాన్య పత్రం జత చేసి మండల ఉద్యాన శాఖ అధికారి లేదా, గ్రామ ఉద్యాన సహాయకుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు, గ్రామ సెరికల్చర్ సహాయకులు, సూక్ష్మ నీటి పారుదల ప్రాంతాలతో గానీ లేక గ్రామ రైతు సేవా కేంద్రంతో పాటు మైక్రో ఇరిగేషన్ కార్యాలయంలో బయోమెట్రి ద్వారా గానీ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. అదే విధంగా కంపెనీలు అనాసక్తి చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం బకాయి మొత్తాలను విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రూ.1,167 కోట్ల బకాయిలు ఉన్నాయని, అందులో దాదాపు రూ.176 కోట్లు మొదటి విడత ఆయా కంపెనీలకు ప్రభుత్వం విడుదల చేసిందని, దీని వల్ల రైతులు ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా డ్రిప్ ఇరిగేషన్‌కు ఆసక్తి చూపాలని తమ పొలాల్లో ఈ పరికరాలను ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేయాలని అధికారులు తెలుపుతున్నారు.

రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 30వేల హెక్టార్లల్లో డ్రిప్పు సేద్యాన్ని రైతులకు వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. 90 శాతం దాకా రాయితీ అందిస్తున్న ఈ పథకాన్ని బోర్ల కింద పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఉపయోగించుకోవాలి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులకు డ్రిప్పు విధానం ఎంతో అనువైనది. ప్రస్తుతం గ్రామాల్లో రైతు సలహా కేంద్రాలతో పాటు మా శాఖ సిబ్బంది డ్రిప్పుపై రైతులకు అవగాహన కల్పించి పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

-ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ



పొలాల్లో ఏర్పాటు చేయనున్న డ్రిప్ పరికరాలు

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

- అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సిందే
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ కే.సంతోషరావు

కల్లూరు, ఆగస్టు 13: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేలా అధికారులు సిబ్బంది కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావు ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌భవన్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని సమస్య ఎర్పడిన వెంటనే స్పందించి పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్ నియంత్రికలు కాలిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని, వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. అధికలోడు ఉండే 33 కేవీ, 12 కేవీ లైన్లకు అదనంగా కొత్త ఫీడర్లను నిర్మించడానికి తగు చర్యలు తీసుకుని, లోటల్టేజీ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. రోడ్డు క్రాసింగ్ లైన్లు ఎత్తు పెంపు, లైన్ల నిర్వహణపై అశ్రద్ధ వహించకూడదని ఆదేశించారు. పట్టణ, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్, మెయింటేనెన్స్ సీజీఎం ఆర్.పద్మ, ఆర్.ఏఐ సీజీఎం కెఆర్ఎస్.ధర్మజ్ఞాని, కర్నూలు ఎస్ఈ యం.ఉమాపతి, ఎస్ఏఓ చిన్నరాఘవులు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి వినతి: వి.ఈ.డబ్ల్యూగా చేసిన సర్వీసును పెన్షన్ సర్వీస్‌కు కలపాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావుకు రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.నాగమల్లేశ్వరావు వినతిపత్రం అందించారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యుత్ సంస్థకు సేలందించిన విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్లు చేసిన సర్వీస్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పి.నాగరాజు, కేవీ భాస్కర్‌రెడ్డి, అహమ్మద్‌బాషా, వీరభద్రప్ప పాల్గొన్నారు.

జోగి రమేష్ అక్రమాలపై లోతుగా విచారించాలి

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పత్తికొండ, ఆగస్టు 13: అధికారాన్ని అడ్డుపెట్టుకుని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు జోగి రమేష్, అతడి కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పత్తికొండలో మాట్లాడారు. 2019లో ఎన్నికల ప్రచారంలో అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలిచి వారికి న్యాయం చేస్తామని వైసీపీ డ్రామాలు ఆడిందన్నారు. అప్పట్లో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు అగ్రిగోల్డ్ భూములను స్వాహ చేశారన్నారు. ఐదేళ్ల పాటు భూ కుంభకోణాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. అగ్రిగోల్డ్ భూముల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై నిజానిజాలను తమప్రభుత్వం వెలికితీసిందన్నారు. అందులో భాగంగానే ఏసీబీ అధికారులు జోగిరమేష్ కుమారుడిని అరెస్టు చేసిందన్నారు. ఈ కుంభకోణంలో మరింత లోతుగా దర్యాప్తు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

కాడెద్దుల ఊయల



ఓ రైతు దంపతులు తమ కొర్ర పంటలో దంతె పట్టాలి. దీనికి కాడెద్దులను బాడుగకు పిలిపించుకున్నారు. వాళ్ల రెండేళ్ల కుమారుడిని ఇంటి దగ్గర పట్టుకోవడానికి ఎవరూ లేరు. దీంతో తమతోపాటే పొలానికి తీసుకవచ్చారు. ఎద్దుల కాడికి ఊయల కట్టి అందులో పిల్లాడిని నిద్రపుచ్చి తండ్రి ఇతర కూలీలతో కలిసి దంతె పట్టగా, దంతెలో తొలగిన కలుపు మొక్కలను తల్లి గట్టుకు ఎత్తివేసే పనిలో నిమగ్నమైంది. మంగళవారం ఈ దృశ్యం వెంకటగిరి వద్ద రైతు అనిల్ పొలంలో కనిపించింది.

-కోడుమూరు రూరల్

తాత్కాలిక గేటు తయారీలో ఇంజనీర్లు

- కొట్టుకుపోయిన గేటును పరిశీలించిన మంత్రులు, ఎంపీ
- టీబీపీ డ్యాంకు చేరుకున్న సీఈ కబీర్‌బాషా

కర్నూలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. డ్యాంకు వరద తగ్గడంతో ఎత్తిన గేట్లు దింపుతుండగా శనివారం రాత్రి చైన్‌లింక్ తెగిపోయి గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. మరమ్మతు కోసం జలాశయంలో నిల్వ ఉన్న 105.788 టీఎంసీల్లో 65 టీఎంసీలు వృథాగా వదిలేస్తున్నారు. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల్లో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, కేసీ కాలువ కింద ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కనీసం ఖరీఫ్ సాగుకైనా సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా టీబీపీ బోర్డు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు మరమ్మతులపై దృష్టి సారించారు.

తుంగభద్ర డ్యాం గేటు మరమ్మతుల్లో జిల్లాకు చెందిన ఇంజనీర్లు కృషి చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు కావడంతో నిర్వహణ కోసం 35 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. గేటు కొట్టుకుపోయిన విషయం తెలియగానే సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. సీఈ సీడీవో కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని పంపారు. జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయిప్రసాద్ డ్యాంలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి డ్యాంకు చేరుకొని మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా మంగళవారం హోస్పేట్‌కు చేరుకొని డ్యాం గేటు మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. హోసహళ్లి దగ్గర నారాయణ ఇంజనీరింగ్ వర్క్స్, హిందుస్తాన్ ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థలకు చెందిన వర్క్ షాపుల్లో జరగుతున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తాత్కాలిక గేటు తయారీ పనులను పరిశీలించారు. అలాగే రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆలూరు టీడీపీ నేత బీ. వీరభద్రగౌడ్ తదితరులు డ్యాంను సందర్శించారు. వీరికి డ్యాం డిజైన్, మరమ్మతులు, స్టాప్‌లాగ్ తయారీపై గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడు వివరించారు.



తుంగభద్ర డ్యాం డిజైన్, తాత్కాలిక గేట్ ఏర్పాటుపై మంత్రులు, ఎంపీకి వివరిస్తున్న కన్నయ్యనాయుడు

ఐదారు రోజుల్లో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు

తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుకు వేగంగా పనులు చేస్తున్నారు. ప్రాజెక్టుల గేట్ల నిపుణులు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో మరమ్మతుల్లో ఇంజనీర్ల కృషి అభినందనీయం. జరుగుతున్న పనులు చూస్తే ఐదారు రోజుల్లో తాత్కాలిక గేటు ఏర్పాటు పనులు పూర్తి అవుతాయి. ఖరీఫ్‌కు సాగునీరు ఇబ్బంది లేకుండా త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయాలని బోర్డు అధికారులను కోరితే సానుకూలంగా స్పందించారు.

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు

తుంగభద్ర ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

- ఉత్సవాలకు 300 మందితో బందోబస్తు
- నదీతీరంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు



నదీతీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది ప్రవాహాన్ని ఎస్పీ జి. బిందు మాధవ్ పరిశీలించారు. మంగళవారం సాయంత్రం నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణం, పార్కింగ్, పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలకు 300 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పది మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 40 మంది ఏఎస్ఐలు, 200 మంది పోలీసులు స్పెషల్ పార్టీ, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, మహిళా పోలీసులతో పాటు హోంగార్డ్స్, మఠం సెక్యూరిటీతో బందోబస్తు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పార్కింగ్, క్యూలైన్లు, వీఐపీల ప్రొటోకాల్, భోజన వసతి దగ్గర తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో ఆదోని డీఎస్పీ సోమన్న, మంత్రాలయం సీఐ రామాంజులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ బిందుమాధవ్

గోనెగండ్ల, ఆగస్టు 13: జిల్లాలోని ఫాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలో ఫాక్షన్ గ్రామమైన కున్నూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఉన్న ఫాక్షన్ గ్రామాలలో ఆయన పర్యటిస్తు అక్కడి పరస్థితులను అంచానా వేస్తున్నారు. అందులో బాగంగా కున్నూరుకు మంగళవారం ఎస్పీ వచ్చారు. గ్రామంలో ఫ్యాక్షన్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చట్టపరమైన హక్కులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), ఆగస్టు 13: సమాజంలో మానసిక వికలాంగులు కూడా ఒక భాగమేనని వారికి కూడా చట్టపరమైన హక్కులు ఉంటాయని జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. మంగళవారం కల్లూరు మండలంలోని చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడుతున్న తమకు ఏమైనా సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. వితంతు పింఛన్, వినియోగదారుల హక్కుల గురించి ఆయన వివరిస్తూ సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఎలాంటి కోర్టు ఫీజులు లేకుండా సత్వర న్యాయాన్ని పొందవచ్చని తెలిపారు. పెండింగ్ కేసులే కాకుండా ఇంకా దాఖలు కానీ ప్రిలిటిగేషన్ కేసులు కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజు నాయుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు



నరసమ్మ

ఎమ్మిగనూరు, ఆగస్టు13: ఎమ్మిగనూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న చాకలి నరసమ్మ(70) గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయిందని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె కుమారుడు రామన్న ఫిర్యాదు చేశారు. ఇటీవల నందవరం మండలం ముగతి గ్రామంలో తన కుమార్తెను చూసి వస్తానని నరసమ్మ బయటకు వచ్చింది. అయితే కూతురు ఇంటికి చేరుకోలేదు. తిరిగి ఎమ్మిగనూరులోని ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్ల దగ్గర వెతికారు. ఎక్కడా ఆచూకి లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు సెల్:9025551638, 8300105314లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కర్నూలు రేంజ్ పరిధిలో 62 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 13: కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, కడప జిల్లాల్లో 62 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి కడప అన్నమయ్య జిల్లాలకు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాలకు 29 మంది సీఐలను బదిలీ అయ్యారు. కడప నుంచి అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య నుంచి కడపకు 33 మంది సీఐలను బదిలీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.రామయ్య నాయుడు	కర్నూలు టూటౌన్	కర్నూలు వన్‌టౌన్
వై.పవన్ కుమార్	కర్నూలు వన్‌టౌన్	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
బి.మధుసూదన్ గౌడు	సీఐడీ, ఆర్‌వో, కర్నూలు	కర్నూలు ఫోర్త్‌టౌన్
పి.శంకరయ్య	కర్నూలు ఫోర్త్ టౌన్	వీఆర్ఎస్పీ, కర్నూలు
ఎం.తబ్రేజ్	వీఆర్, అనంతపురం	కోడుమూరు సర్కిల్
ఎస్.మన్సూరుద్దీన్	కోడుమూరు సర్కిల్	వీఆర్ఎస్పీ, కర్నూలు
ఎస్‌కే ఇస్మాయిల్	నంద్యాల ట్రాఫిక్	నంద్యాల టూటౌన్
కే.రాజారెడ్డి	నంద్యాల టూటౌన్	బి.కొత్తకోట, అన్నమయ్య జిల్లా
ఎస్.అస్రార్ బాషా	వీఆర్ఎస్పీ, నంద్యాల	నంద్యాల టూటౌన్
టి.నరసింహులు	నంద్యాల త్రీటౌన్	వీఆర్ఎస్పీ, నంద్యాల
ఎస్.సూర్య మౌళి	డీఎస్బీ, నంద్యాల	నంద్యాల తాలుకా
బి.శ్రీనివాసరెడ్డి	డీఎస్బీ-2, కర్నూలు	నంద్యాల రూరల్
ఎన్.శివకుమార్ రెడ్డి	నంద్యాల రూరల్	వీఆర్ఎస్పీ, నంద్యాల
ఎస్.వంశీధర్	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల	సిరివెళ్ల సర్కిల్
జి.చంద్రబాబు	సిరివెళ్ల సర్కిల్	శ్రీశైలం టూటౌన్
జే.రమేష్ కుమార్	శ్రీశైలం టూటౌన్	వీఆర్ఎస్పీ, నంద్యాల
ఎన్.కృష్ణయ్య	మహిళా పోలీస్ స్టేషన్, అన్నమయ్య జిల్లా	బనగానపల్లె యుపీఎస్, నంద్యాల
జి.ఇబ్రహీం	కడప టూటౌన్	సీసీఎస్, కర్నూలు
బీవీ రమణ	వీఆర్, నంద్యాల	రాజంపేట రూరల్, అన్నమయ్య
ఎం. శ్రీనాథరెడ్డి	వీఆర్ఎస్పీ, కడప	డీఎస్బీ-2, కర్నూలు
వి.శ్రీనివాసులు	వీఆర్ఎస్పీ, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ సెల్, కర్నూలు
ఏ.వేణుగోపాల్	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌సెల్, కర్నూలు	వీఆర్ఎస్పీ, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మమ్మ	వీఆర్ఎస్పీ, కర్నూలు	ఉమెన్ పీఎస్, కర్నూలు
డి.హజీవలి	ఉమెన్ పీఎస్, కర్నూలు	పులివెందుల ట్రాఫిక్
ఎల్. విజయలక్ష్మి	పీసీఆర్, ఆదోని	డీటీఆర్బీ, కర్నూలు
ఏ.ఆదినారాయణ రెడ్డి	డీటీఆర్బీ, కర్నూలు	వీఆర్ఎస్పీ, కర్నూలు
జి.సుబ్బారావు	వీఆర్ఎస్పీ, నంద్యాల	ఆదోని ట్రాఫిక్ పీఎస్
సి.భాస్కర్ రెడ్డి	వీఆర్ఆర్‌వో, కర్నూలు	డీసీఆర్బీ, కడప
ఎం.నాగ శేఖర్	డీపీటీసీ, అన్నమయ్య	వీఆర్, రేంజ్ ఆఫీస్, కర్నూలు

అప్పులు తీర్చలేక తనువు చాలించిన అన్నదాతలు

వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల బలవన్మరణం



లక్ష్మానాయక్(ఫైల్)



మిద్దె కృష్ణయ్య(ఫైల్)

చాగలమర్రి/దొర్నిపాడు, ఆగస్టు 13: అప్పులు అధికమై.. పంటలు దక్కక తీవ్ర ఒత్తిడికి లోనై నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. చాగలమర్రి మండలం ఎం.తండ గ్రామంలో రైతు లక్ష్మానాయక్ (46), దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన బుడ్డమిద్దె కృష్ణయ్య(50) బలవన్మరణానికి పాల్పడ్డారు. చాగలమర్రి మండలం ఎం.తండా గ్రామానికి చెందిన లక్ష్మానాయక్ తనకున్న ఆరు ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశాడు. ఇందుకోసం పలుచోట్ల రూ.7లక్షలకు పైగా అప్పులు చేశాడు. ప్రకృతి సహకరించకపోవడంతో పంటలు దక్కలేదు. ఇదే సమయంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో మంగళవారం సొంతపొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో లక్ష్మానాయక్ మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు సంతానం. చాగలమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అదేవిధంగా దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన బుడ్డమిద్దె కృష్ణయ్య (50) అనే కౌలు రైతు తనకున్న 1.5 ఎకరాల పొలంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిరప, సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.15 లక్షలు దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మదనపడిన రైతు కృష్ణయ్య సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. పక్కపొలంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆయన కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో రాజీపడొద్దు

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించడంలో రాజీ పడవద్దని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. సోమవారం రాత్రి ఊంజల మండపం ప్రాంగణంలో ఉత్సవాల ఏర్పాట్లపై శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీరు, వైద్యం, పరిమళ ప్రసాదం, వసతి, పరిశుభ్రత, క్యూలైన్లు, రథోత్సవాల ఊరేగింపు, అన్నదానం, ట్రాఫిక్, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఈ ఏడాది 5 లక్షలకు పైగా భక్తులు రావచ్చని అంచనా చేసిన పీఠాధిపతి భక్తులకు తగ్గట్టుగా ఏర్పాట్లలో రాజీ పడొద్దన్నారు. ఈ సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, అప్రమేయాచార్, డా.సుధీంద్ర, సూపరింటెండెంట్లు విజయేంద్రాచార్, రవి కులకర్ణి, వ్యాసరాజాచార్, శ్రీహరి, దేశాయ్ నరసింహ, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి పాల్గొన్నారు.

ఉత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఐపీ నరసింహమూర్తి, అనంతపురానిక్

రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురానిక్ ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడును కలిసి ఆహ్వాన పత్రిక, స్వామివారి శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు అందజేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, రాష్ట్ర మంత్రి నారాయణకు కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 1.7 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 13: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా రెండో సోమవారం భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు దేవస్థానపు కాలక్షేపపు మండపంలో మంగళవారం ఆలయ డిప్యూటీ కమీషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. నగదు రూపంలో రూ.1,07,72,969, బంగారం 52 గ్రాములు, వెండి 19.7 కిలోలు, ఆస్ట్రేలియా కరెన్సీ 50 డాలర్లు, అమెరికన్ కరెన్సీ 184 డాలర్లు వచ్చినట్లు గురుప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త ఓటరు జాబితా ప్రచురించండి

అధికారులను ఆదేశించిన ఎలక్షన్ కమిషన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 13: 2025 జనవరి 6వ తేదీ నాటికి సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సమ్మరి రివిజన్, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటి ఓటర్లసర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అక్టోబరు 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబరు 24లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో కే.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆటో - ఇద్దరు మృతి

పాణ్యం, ఆగస్టు 13 : స్థానిక డొంగు రస్తా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. నంద్యాల దేవనగర్‌కు చెందిన శేషయ్య, సాయిబాబానగర్‌కు చెందిన సుబ్బయ్య మంగళవారం ఉదయం ఆటోలో పాణ్యం ఇందిరానగర్‌కు చేరుకొని పని ముగించుకొని డొంగు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా కర్నూలుకు వెళ్లే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని పాణ్యం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే శేషయ్య మృతిచెందాడు. చికిత్స అందిస్తుండగా సుబ్బయ్య చనిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 13: నంద్యాల పట్టణ శివార్లలోని ఆటో నగర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి శ్రీనివాసులు (38) అక్కడి కక్కడే మృతి చెందాడు. వైఎస్ నగర్‌కు చెందిన మంగలి శ్రీనివాసులు సమీపంలోని శాంతిరాం జనరల్ ఆసుపత్రిలో బార్బర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వైఎస్ నగర్ నుంచి శాంతిరాం ఆసుపత్రికి వెళుతుండగా ఆటోనగర్ వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ విద్యా సంస్థ వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. ఘటనా స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

టీచర్‌గా మారిన ఆర్డీవో



బోర్డుపై లెక్కలు రాస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

పత్తికొండ, ఆగస్టు13 : డివిజనల్ రెవెన్యూ అధికారిగా నిత్యం బిజీబిజీగా ఉండే ఆర్డీవో రామలక్ష్మి మంగళవారం పత్తకొండ మండల పరిధిలోని జీవరాళ్లమల తండా(జెఎంతండా) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఓ విద్యార్థితో ఇంగ్లీషు పాఠం చదివించారు. మరో విద్యార్థినితో పాఠంలోని పదాలకు అర్థాలు అడిగారు. బోర్డు మీద లెక్కలు రాసి విద్యార్థులతో సమాధానం రాయించారు. ఏకోపాధ్యాయ పాఠశాల అయినప్పటికీ ఉపాధ్యాయురాలు కళ్యాణి విద్యార్థులకు చక్కగా చదువు చెబుతున్నారని అభినందించారు. కాగా వారం రోజుల క్రితం మరో ఉపాధ్యాయుడు నాగభూషణంను నియమించారని కళ్యాణి ఆర్డీవోకు వివరించారు. ఈ పాఠశాల ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల ఆదర్శం అని ఆర్డీవో అన్నారు.

స్కూలు బస్సుల ఆకస్మిక తనిఖీ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 13: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను, వ్యాన్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు డీటీవో శివారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. పర్మిట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను, పన్నులు చెల్లించని వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. పన్ను రూపంలో రూ 12070, పెనాల్టీ రూపంలో 10800, సీఎఫ్ కింద రూ 54400 మొత్తం తనిఖీల్లో రూ77270 వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించినట్లు ఆయన తెలిపారు.

త్వరలో రెవెన్యూ సదస్సులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్యంగా భూ వివాద సమస్యలపై 70 నుంచి 80 శాతం అర్జీలు ప్రజల నుంచి వస్తున్నాయన్నారు. భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో గ్రామాల్లోనే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో పత్తికొండ మండలంలో దొంగ పాసు పుస్తకాలు ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడం లాంటి సంఘటనలు చాలా జరిగాయన్నారు. వీటిని పరిష్కరించేలా పత్తికొండ టౌన్‌లో రెవెన్యూ సదస్సు ఒకరోజు కాకుండా 3 నుంచి నాలుగు రోజులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో కూడా భూముల కబ్జాలు చేయడం, డబుల్ రిజిస్ట్రేషన్లు లాంటి సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. లేఅవుట్, మున్సిపాలిటీల్లో ఉన్న ఓపెన్ ల్యాండ్‌లను కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, చెరువులను కూడా కబ్జా చేశారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆదోని టౌన్‌లో 3 రోజులు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు గడువు పెంపు

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 13: పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏపీఎస్ఏహెచ్‌పీసీ ఇన్‌చార్జి అండ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. దరఖాస్తులు www.appmb.co.in (or) appsahpc.co.in వెబ్‌సైట్‌లో ఈ నెల 18వ తేదీ వరకు లభించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలోపు మెడికల్ కాలేజీలో అందజేయాలని కోరారు.

అయ్యో పాపం

- నీటి బకెట్‌లోపడి చిన్నారి మృతి
- వలస వెళ్లిన తల్లిదండ్రులకు తీరని శోకం



చిన్నారి గానవి (ఫైల్)

దేవనకొండ, ఆగస్టు 13 : పేదరికం, కరువు వల్ల తల్లిదండ్రులు వలస వెళ్లారు. ఇద్దరు చిన్నారులు నానమ్మ, మేనత్త పోషణలో ఉన్నారు. ఆడుకుంటూ ఉన్న చిన్నారి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం దేవనకొండ బీసీ కాలనీకి చెందిన ఎర్రగోటి మారెన్న, సుమలత దంపతులకు ఇద్దరు సంతానం. వీరితోపాటు ఇంట్లో మారెన్న తల్లి లక్ష్మమ్మ, అక్క మాదేవి ఉన్నారు. పేదరికం వల్ల ఇద్దరు చిన్నారులను నాయనమ్మ, మేనత్తల వద్ద వదిలి పెట్టి తెలంగాణలోని గద్వాల జిల్లాలో పత్తి పంట పనులకు మారెన్న దంపతులు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం లక్ష్మమ్మ బయట బట్టలు ఉతుకుతుండగా, మాదేవి స్థానిక జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం పనులు ముగించుకొనివచ్చింది. ఈలోగా చిన్నారి గానవి(3) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. మాదేవి వచ్చి చూసేసరికి పాప మృతి చెందింది. బతుకుతెరువు కోసం వలస వెళ్లిన తల్లిదండ్రులకు పాప మృతి తీరని శోకాన్ని మిగిల్చింది.

బొలేరో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

తుగ్గలి, ఆగస్టు 13: జొన్నగిరి, రాంపురం, ఉప్పర్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు సుధీర్, రంగస్వామి, రంగనాథ్ పచ్చిమిర్చి పంటను అమ్ముకుని తిరిగి వస్తుండగా.. బోలెరో వాహనం బోల్తా పడి ంది. ఈ ప్రమాదంలో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను గుత్తి వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

అత్తింటి వేధింపులు..

ఆరుగురిపై కేసు నమోదు

కూడేరు, ఆగస్టు 13 : అనంతపురం జిల్లా కూడేరుకు చెందిన జ్ఞానిక అనే మహిళను వేధిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆమె భర్తతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కూడేరుకు చెందిన జ్ఞానికకు కర్నూల్ జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండెకల్లుకు చెందిన విజయ్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. వివాహమైన కొద్ది రోజులకు ఆమె గర్భం దాల్చింది. ఆమెను భర్త విజయ్‌తో పాటు అతడి తల్లి ప్రమీళ, తండ్రి గోపాల్, అన్న బ్రహ్మయ్య, వదిన బ్రాహ్మణి, అక్క పుణ్యవతి నిత్యం వేధింపులకు గురిచేశారు. అంతటితో ఆగకుండా తన అనుమతి లేకుండా గర్భం తొలగించారని జ్ఞానిక తల్లిదండ్రులకు తెలిపింది. ఈ మేరకు జ్ఞానిక, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా... బాధితురాలి భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు కూడేరు పోలీసులు తెలిపారు. ఇందులో భర్త విజయ్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురు ఎస్ఐలు బదిలీ

కర్నూలు, ఆగస్టు 13: కర్నూలు డివిజన్ పరిధిలో ఆరుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు వన్‌టౌన్‌లో పనిచేస్తున్న ఎస్.బాల నరసింహులును హొళగుందకు బదిలీ చేశారు. ఎమ్మిగనూరు టౌన్ యూపీఎస్ ఎస్ఐ రమేష్ బాబును కర్నూలు వన్‌టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న కేపీ ప్రహ్లాదను ఆదోని పీసీఆర్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న ఎం.పరమేష్ నాయక్‌ను మంత్రాలయానికి బదిలీ చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో వీఆర్‌లో ఉన్న హెచ్.డాక్టర్ నాయక్‌ను ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్‌కు, అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ ఎస్ఐ వి.శ్రీనివాసులును నందవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య

పెద్దకడుబూరు, ఆగస్టు13: రైల్వే ట్రాక్‌మెన్ ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం చిన్నతుంబళం గ్రామం చెరువు సమీపంలో జరిగింది. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గుంతకల్లుకు చెందిన శివలింగప్ప(57) రైల్వే ట్రాక్‌మన్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా గుంతకల్లు నుంచి మంత్రాలయం వెళ్తున్నాడు. ఆదోని-మాధవరం రోడ్డులోని చిన్నతుంబళం గ్రామం వెలుపల చెరువు వద్ద రోడ్డుపై ఐచర్ వాహనంలో టాపు అంగులర్‌కు తాడుతో ఉరివేసుకున్నాడన్నారు. మృతుడి కుమారుడు లింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్ల పరిశీలన


పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ): నగరంలోని జిల్లా పరేడ్ మైదానంలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులతో కలిసి పరి శీలించారు. నగరపాలక సంస్థకు సంబంధించి నీటి సరఫరా, పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట మెడికల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, ఎంఈ షాకిర్, సెక్రటరీ నాగరాజు, ఏఈ ప్రవీణ్‌కు మార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి ఉన్నారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించండి

కర్నూలు(కలెక్టరేట్): ప్రతి గ్రామ పంచాయితీల్లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలని డీపీవో నాగరాజు నాయుడు అధి కారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య వేడు కల నిర్వహణకు 5వేలలోపు జనాబా ఉన్న గ్రామపంచాయితీలు రూ.10 వేలు వరకు, వేలు పైబడిన జనాబా ఉన్న గ్రామ పంచాయతీలు రూ25 వేల వరకు వ్యయం చేయవచ్చని పేర్కొన్నారు. జాతీయ పండుగకు చేసిన వ్యయాన్ని గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి సర్దుబా టు చేసుకోవచ్చని సూచించారు.

'దేశాభివృద్ధికి కృషి చేయాలి'


ర్యాలీని ప్రారంభిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 13: లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో, నగరంలోని కేఎస్ఆర్ పాఠశాల విద్యార్థులతో రానున్న 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 150 అడుగుల జాతీయ జెండాతో నగరంలోని వెంకటరమణ కాలనీలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి గోపీనాథ్ తదితర క్లబ్ సభ్యులు జాతీయ జెండా, లయన్స్ ఫ్లాగ్‌లను ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సంపూర్ణ పేదరిక నిర్మూలన జరిగే వరకు ప్రతిఒక్కరూ దేశభక్తితో నిస్వార్థంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, కేఎస్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వర్, జగదీష్, షరీఫా, ఉదయ్, సుబ్బమ్మ, శారద, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ పతాక స్ఫూర్తిని చాటుదాం'


జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 13: జాతీయ పతాక స్ఫూర్తిని భారతీయులంతా ఒక్కటేనన్న సమైక్యతతో చాటిచెబుదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నగరంలోని 46వ వార్డు రైల్వేస్టేషన్ ఎదురుగా జాతీయ పతాకాన్ని పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ జాతీ య పతాకం స్వతంత్ర భారత నిర్మాణంలో పోషించిన పాత్ర అందరిలో స్ఫూర్తిని నింపుతుందని అన్నారు. బీజేపీ నాయకులు శివయ్యశెట్టి, శ్రీనివాసులు, శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

కల్లూరు, ఆగస్టు 13: హర్‌ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా నగరంలో మంగళవారం ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వ హించారు. బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీఎస్.నాగరాజు, టీడీపీ నాయకులు ఎస్వీ.రామకృష్ణ, కె.చెన్నయ్యలు మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి భారతీయుడు ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూ చిం చారు. కార్యక్రమంలో మీసాల గంగాధర్, మద్దిలేటిరెడ్డి, రామ్మోహ న్‌రెడ్డి, శ్రీనివాసులు, రవి, సతీష్, రమణ పాల్గొన్నారు.

'ర్యాలీని విజయవంతం చేయండి'

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 13: నగరంలో బుధవారం నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. మంగళవారం డీఎస్ఏ కార్యాలయంలో ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్ తిరంగ జెండా ఆగస్టు 13, 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలని ఆయన తెలిపారు. 14న ర్యాలీ కొండారెడ్డి బురుజు దగ్గర ప్రారంభమై డీఎస్ఏ స్టేడియంలో ముగుస్తుంది. ర్యాలీకి కలెక్టర్, ఎస్పీ, కర్నూలు ఎంపీ నాగరాజు, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

రేపు మాంసం దుకాణాలు మూసివేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని మాంసం దుకాణాలు, కబేళాలు మూసివేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పీవీ రామ లింగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతువులను వధిం చడం, విక్రయిం చడం నేరమన్నారు. అలాగే హోటల్స్ రెస్టారెంట్లలో మాంసం అమ్మరా దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీడీవోను కలిసిన టీడీపీ నాయకులు

సి.బెళగల్, ఆగస్టు 13: ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఏఈ రాముడును మంగళవారం టీడీపీ నాయకులు, మాజీ మండల కన్వీనర్ తిమప్ప, వెంకటేశ్వర్లు, బాలజీ వెంకటేష్, ధనంజయుడులు మార్యద పూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని ఆయన్ను కోరారు.

అవయవ దానంతో ప్రాణాలు కాపాడండి

ఐఎంఏ వైద్యుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 13: అవయవ దానం చేసి విషమ పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలు నిలబెట్టాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కర్నూలు బ్రాంచ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వ ర్యంలో అవయవదానం దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని పాణ్యం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే గౌరు చరిత వైద్యులతో అవయవదానంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ దేశంలో 3 లక్షల మందికి అవయవ దానం అవసరం కాగా, కేవలం 16 వేల మంది మాత్రమే అవయవ దానా నికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి. మాధవి శ్యామల, జాయింట్ సెక్రటరీ సాయివాణి, సీనియర్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు బి. రవీంద్రబాబు పాల్గొన్నారు.

పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయం

ఓర్వకల్లు: పొదుపు మహిళల స్ఫూర్తి ప్రశంసనీయమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి భూమి పూజ, పొదుపు మహిళల సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరిత, మల్లెల రాజ శేఖర్ హాజరయ్యారు. బైరెడ్డి కాలనీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి, మసీదు వద్ద జీకే సుధాకర్ వద్ద నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గౌరు చరిత, మల్లెల రాజశేఖర్, సర్పంచ్ చంద్ర గోవర్దనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మలు భూమి పూజ చేశారు. అనంతరం పొదుపు మహిళల సభలో గౌరు చరిత, మల్లెల రాజ శేఖర్ మాట్లాడుతూ 1997లో సీఎం చంద్రబాబు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. దినాదినాభివృద్ధి చెంది పొదుపు మహి ళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఏఈ నాగసుబ్బయ్య, నాయకులు పార్వ తమ్మ, గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, చంద్రపెద్ద స్వామి, ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, రాము, కేవీ మధు, సుధాకర్, మహబూబ్ బాషా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ కాలనీల అభివృద్ధికి పెద్దపీట: గౌరు చరిత

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డు రాఘవేంద్రనగర్‌లో అభివృద్ధి పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత భూమి పూజ చేశారు. మంగళవారం నగర్ మేయర్ బీవై. రామయ్యతో కలిసి ఎమ్మెల్యే రూ.70 లక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచు కుని వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గౌరుచరిత తెలిపారు.

గౌరు చరిత పూజలు: కల్లూరు అర్బన్ 41వ వార్డు వీకర్‌సెక్షన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం స్వామివారి కళ్యాణ వేడుకలకు విచ్చే సిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనం తరం నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గౌరుచరితను ఘనంగా సన్మానించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి: ఎమ్మెల్యే

కర్నూలు(న్యూసిటీ): కల్లూరు అర్బన్ ప్రాంతంలోని 16 వార్డులలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావే శం నిర్వహించారు. శివారు కాలనీల్లో రోజు విడిచి రోజు తాగునీరు వస్తున్నా యని, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రాబోవు కాలంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎంఈ షాకీర్ హుస్సేన్, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే, ఐఎంఏ వైద్యులు


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఘనంగా మల్లెల రాజశేఖర్ జన్మదిన వేడుకలు



హుశేనాపురంలో కేక్ కట్ చేస్తున్న రాజశేఖర్, పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత, రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

ఓర్వకల్లు, ఆగస్టు 13: మండలంలోని హుశేనాపురం గ్రామంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మల్లెల రాజశేఖర్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. అదేవిధంగా మండ లంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హుశేనాపురానికి తరలివచ్చి పూలబొకేలు ఇచ్చి మల్లెల రాజశేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హుశేనాపురంలోని జడ్పీ, మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మల్లెల రాజశేఖర్ కేక్ కట్ చేశారు. కార్యక్ర మంలో కేవీ మధు, బజారు, షఫీవుల్లా, సుధాకర్, మహబూబ్ బాషా, అన్వర్, రామ గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులా పరమేశ్వరి గ్రామోత్సవం


అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, ఆగస్టు 13: మండలంలోని కె.నాగలాపురంలో సుంకులాపర మేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సుంకులాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా కె.నాగలాపురం గ్రామం నుంచి అమ్మ వారు వెలసిన పెంచికలపాడులోని చిలకలమాన్యం పొలంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నరసయ్య, సిబ్బంది కేశవ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, మద్దిలేటి, పూజారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర వాతావరణం


వర్మీ కంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచులు

ఓర్వకల్లు, ఆగస్టు 13: పర్యావరణ పరిరక్షణ ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సంపాదించుకోగలుగుతామని ఎంపీడీవో శివనాగప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయంలో రెండో రోజు సర్పంచుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నన్నూరు గ్రామ సమీపంలోని వర్మీకంపోస్టు కేంద్రాన్ని అధికారులు, సర్పం చులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, సర్పం చులు బ్రహ్మయ్య, లలితమ్మ, గోవర్దన్, జయ భారతమ్మ, రామచం ద్రుడు, పుష్పమ్మ, రజితమ్మ, శకుంతలమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 13: సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు నీటి వనరుల సమీపంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వాటర్ బాడీస్ ఆక్రమణలపై కలెక్టర్ సం బంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వనరుల వద్ద ఆక్రమణలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలకు గురైన వివరాలను రెవెన్యూ అధికారులకు అందజే యాలని సూచించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారా యణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రామలిం గేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించండి

కోడుమూరు(రూరల్), ఆగస్టు 13: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని లద్దగిరి జడ్పీ ఉన్నత పాఠ శాల హెచ్‌ఎంను విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈనెల 8న జరగాల్సిన ఎస్ఎంసీ ఎన్నిక కోరం లేని కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. తిరిగి వచ్చే 17వ తేదీ నిర్వహించడానికి షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం పలువురు తల్లిదండ్రులు హెచ్ ఎంను కలిశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు టీడీపీ నాయకులు మద్దతు పలికారు. రహస్య ఓటింగ్ జరపాలని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్ ఎంకు విన్నవించారు. అయితే రహస్య ఓటింగ్‌పై హెచ్‌ఎం మధు తన వైఖరి వెల్లడించలేదు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు, టీడీపీ నాయ కులు కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలపడంతో రహస్య ఓటింగ్‌కు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మహబూ బ్ బాషా, రామాంజనేయులు, మిన్నల్ల హుసేన్, పి.మిన్నల్ల, టీడీపీ నాయ కులు పట్టెక్రిష్ణ, పట్టె మధు, అబ్దుల్లా, దేవరాజు పాల్గొన్నారు.

అవయవదానంతో వెలుగులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 13: అవయవదానంతో మరి కొన్ని జీవితాల్లో వెలుగులు నింపవచ్చునని లయన్స్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య తెలిపారు. మంగళవారం ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్.ఆర్. హాస్పిటల్‌లో పోస్టర్లు విడుదల చేశారు. అవయవదానంపై ప్రజల్లో అపోహలు, సందేహాలు ఉన్నాయని, దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నివేదికలు చదివి వెళ్లారు..


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లెల్సీ ఏఈ

సి.బెళగల్, ఆగస్టు 13: మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి వచ్చిన మండల స్థాయి అధికారులు వచ్చారు. తమ నివేదికలను చదివి వెళ్లారు. మం డలంలోని సమస్యలను మండల ఎంపీటీసీలు, సర్పంచులు మండల స్థాయి అధికారులు సమావేశానికి వచ్చి నివేదికలు చదివి వెళ్లడమే నా? అని ఎంపీపీడీవోను గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపీ డీవోను అడిగారు. మండలంలో బాలికలకు ఎస్సీ, బీసీ హాస్టల్, రోడ్డు, తాగునీరు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, సీసీరోడ్లు, మురుగు కాలు వలు, ఇంటి బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ఆ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు కోరారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.

కంటి జబ్బులపై అప్రమత్తంగా ఉండండి

ఓర్వకల్లు, ఆగస్టు 13: కంటి జబ్బులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆప్తాలిక్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాలలో ఎస్ఈఎస్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిం చి, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించాలి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 13: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వారి ఆలనా పాలనా, రక్షణకు పిల్లలు కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. మంగళవారం నగరంలోని 48వ వార్డు రోజావీధిలో 'వయోవృద్ధుల పోషణ - సంక్షేమ చట్టాలు అమలు' అనే అంశంపై వృద్ధులతో అవగాహన కార్యక్రమంలో నిర్వహిం చారు. ఈసందర్భంగా సుమలత మాట్లాడుతూ నేడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయి, వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పరిస్థితి దయ నీయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధర రెడ్డి, ఐక్యవేదిక సభ్యు లు అంజనేయులు, నాగన్న, నాగప్ప, శేషమ్మ, నారాయణమ్మ తది తరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 13: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవ లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ పీఆర్.పడ్మేట్వర్ సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఖాతాదారులకు ఆయన రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పడ్మేట్వర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా గృహ, మార్టిగేజ్, విద్యా, వ్యవసాయం, టర్మ్ రుణాలతోపాటు ఎంఎస్ ఎంఈ రుణాలు విరి విగా పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్ర మంలో రీజనల్ మేనేజర్ పీఎస్.నవీన్‌కుమార్, సీనియర్ మేనేజర్లు డి.తరుణ్‌కుమార్, ఈ.యుగం ధర్, జి.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎ.గజేం ద్రరెడ్డి, జబివుల్లాఖాన్ పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

ఓర్వకల్లు, ఆగస్టు 13: మండలంలోని పూడిచెర్ల గ్రామసమీపాన 372 సర్వే నెంబరులో ఎలాంటి అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తు న్నారన్న సమాచారం రావడంతో అక్కడికి వెళ్లగా రెండు టిప్పర్లు మట్టిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ గ్రావెల్ మట్టి అనుమతి లేకుండా గుట్ట పాడు సమీపంలోని జయరాజ్ ఇస్పాత్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. రెండు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి: ఎంపీడీఓ

కల్లూరు, ఆగస్టు 13: గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సర్పంచులు, పంచా యతీ కార్యద ర్శుల 3 రోజుల శిక్షణలో భాగంగా ఈఓఆర్డీ రవికిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నటేకూరు చెత్తసంపద కేంద్రం సమీ పంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచా యతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదే శించారు. కార్యక్ర మంలో ఫ్యాకల్టీ వెంకటరత్నం, డీపీఆర్సీ గిడ్డేష్, ఎంపీపీ బి.శారద, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డాక్టర్ల భద్రత.. అందరి బాధ్యత

» కొనసాగుతున్న జూడాల సమ్మె


ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 13: డాక్టర్ల భద్రత.. అందరి బాధ్యత అని ఏపీ జూడాల సంఘం నాయకుడు డా. తనూజ్ అన్నారు. కలకత్తాలో వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళ వారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూనియర్ డాక్టర్లు ఓపీ, ఎలక్టివ్ సేవలను బహిష్కరించారు. ముందుగా కర్నూలు మెడికల్ కాలేజీ నుంచి సూపర్ స్పెషాలిటీ గైనిక్ బ్లాక్, మెడిసిన్, క్యాజువాల్టీల మీదుగా వై ద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మూడు రోజుల్లో తమ డిమాండ్లను నెర వేర్చకపోతే ఎమర్జెన్సీ సర్వీసులను కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

పల్లేటి లక్ష్మీకులశేఖర్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 13: ఇటీవల గుండెపోటుతో మరణించిన ప్రముఖ సినీ, టీవీ, నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ కుటుంబానికి టీజీవీ కళాక్షేత్రం గౌరవ ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్‌లోగల టీజీ వెంకటేశ్ కార్యాలయంలో కులశేఖర్ అల్లుడు మురళికి ఆయన చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ 1998 నుంచి టీజీవీ కళాక్షేత్రానికి ఆస్థాన రచయితగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రంగస్థల కళాకారులు సంగా ఆంజనే యులు, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

జగన్ ఓ సైకో: మాజీ మంత్రి మారెప్ప

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 13: మాజీ ముఖ్యమంత్రి జగన్ ఒక సైకో, డెకాయిట్ అని మాజీ మంత్రి మూలింటి మారెప్ప ఘాటుగా విమర్శించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట విలే కరులతో మాట్లాడుతూ రాజన్న బిడ్డ, జగనన్న బాణం అనే పదాలకు ఇక కాలం చెల్లిపోయిందన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి, , 2029లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సుంకేసుల, శ్రీశైలం డ్యాంల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టు పనులను త్వరితగతిన ప్రారంభించాలని పేర్కొన్నారు.

ఆర్‌యూలో ఘనంగా 'అమ్మ పేరుతో ఒక చెట్టు'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 13: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, ఆయన పిలుపు నిచ్చిన 'అమ్మ పేరుతో ఒక చెట్టు ' (ఏక్ పెహడ్ మా కే నామ్)మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం రాయల సీమ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్‌యూ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లా డుతూ పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో వివిధ రకాల ఔషధ, పండ్ల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికా రులు డాక్టర్ కేవీ రత్నం, డాక్టర్ బి. విజయ్, డాక్టర్ ఎస్ నాగచంద్రుడు, బి.వి. శివప్రసాద్, ఆర్‌యూలోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య

కర్నూలు, ఆగస్టు 13: తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో హోటల్ వెనుకభాగంలో ఉన్న గదిలో నర్సప్ప (14) అనే బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కోడు మూరు చెందిన నరసప్పకు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. కొద్దికాలం పాటు బంధువుల వద్దనే పెరిగాడు. బడికి వెళ్లకుండా చదువును మధ్యలోనే ఆపేశాడు. స్థానిక పుల్లారెడ్డి కళాశాల సమీపంలో ఓ హోటల్‌లో సర్వర్‌గా చేరాడు. హోటల్ వెనుక గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతమానుపల్లెలో ఘర్షణ

సి.బెళగల్, ఆగస్టు 13: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో గత నెలలో మొహర్రం పండుగలో వైసీపీ నాయకులు టీడీపీ వారిపై దాడి చేసిన సంఘటన విదితమే. అయితే బుధ వారం చిన్న అనుమంతు, మద్ది లేటి కలిసి పోతుండగా టీడీపీ వారికి రోజులు దగ్గరపడ్డాయని వారు తిట్టు కుంటూ పోతుండగా టీడీపీ వారు విని చిన్న అనుమంతును, మద్దిలేటిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి ఇరువురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి

సి.బెళగల్, ఆగస్టు 13: యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు బుధవా రం మండల పరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు పోలీసులకు సహకరిం చాలన్నారు. అప్పుడే యువతను మత్తు పానీయాలకు, దురలవాట్లకు బాని సలు కాకుండా చూడవచ్చు అన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

● కూటమి నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

హొళగుంద, ఆగస్టు 13: అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం హర్ ఘర్ తిరంగ ర్యాలీని కూటమి నాయకులు ఈడిగ ప్రసాద్, చిదానంద, బీజే పంపాపతి, ఎర్రిస్వామి, గజ్జెహల్లి రామలింగ, దిడ్డి వెంకటేష్ ప్రారంభించారు. బస్టాండ్ తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మోదీ పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు.

పత్తికొండ టౌన్: స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలంటూ పత్తికొండలో మంగళవారం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డు నుంచి ప్రతి బైక్‌కు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ, నాయకులు బ్రహ్మయ్య, నరేష్, రామ్మోహన్, రామాంజి, విజయమోహన్ రెడ్డి, ఉచ్చురప్ప, రామయ్య ఎక్స్ ఆర్మీ నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

ఆస్పరి, ఆగస్టు 13: మండల కేంద్రం ఆస్పరి జడ్పీ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎంపికైన పూజారి తాయన్న అన్నారు. మంగళవారం విద్యాకమిటీ చైర్మన్‌ను పాఠశాల సిబ్బంది స్థానిక టీడీపీ నాయకులు సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ్ కుమారి, టీడీపీ మాజీ మండల కన్వీనర్ ఎస్ తిమ్మన్న, మాజీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సంజన, మాజీ మార్కెట్ డైరెక్టర్ సంజన, తెలుగు యువత నాయకుడు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి రికార్డుల తరలింపుపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హొళగుంద, ఆగస్టు 13: తహసీల్దార్ కార్యలయంలో అర్ధరాత్రి రెవెన్యూ రికార్డులు తరలింపుపై విచారణ చేపట్టాలని టీడీపీ నాయకులు బీజే పంపాపతి, ఎర్రిస్వామి, దిడ్డీ వెంకటేష్, ముద్దటామాగి తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముంద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా రికార్డులు తరలించి అక్రమాలకు పాల్పడుతున్న ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో హొళగుందలో భారీ భూ అక్రమాలు జరిగాయని వాటిని కప్పిపుచ్చుకునేందుకే రికార్డులు బయటకు తరలించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు విచారణ చేపట్టాలని కోరా రు. కార్యక్రమంలో పూజారి తిప్పన్న, నూర్, వందవగాలి కర్రిలింగ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగస్వామి

మద్దికెర, ఆగస్టు 12: జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంగలి రంగస్వామిని జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. మంగళవారం రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బాల గురుస్వామి రంగస్వామిని ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు పంపారు. ఈ సందర్భంగా రంగస్వామి నాయీ బ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం మండలంలోని మాధవరం మండలంలో టీడీపీ కార్యకర్త మామిడి జాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జాన్ మృతికి టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి సంతాపం తెలిపారు. మంగళవారం భౌతిక కాయానికి సంతాపం తెలిపి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మామిడి జాన్ లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో ఆనంద్, రవి, ప్రసాద్, యాకోబు, దేవదాసు, దావీదు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

ఆలూరు, ఆగస్టు 13: బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, మైదానాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బహిరంగ మద్యం సేవించే వారిని పట్టుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలేజ్ గ్రౌండ్, సంత మార్కెట్, చెక్ పోస్ట్, కొత్త బస్టాండ్, ఎంపీడీవో కార్యాలయం వద్ద, ఆరికెర రోడ్డు సమీపంలో రాత్రి సమయాల్లో మద్యం సేవిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై స్వయంగా వెళ్లి తనిఖీలు చేసి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాగా చదువుకోవాలి: డిప్యూటీ డీఈవో

పత్తికొండ టౌన్, ఆగస్టు 13: సమయం వృథా చేసుకోకుండా ఇష్టంతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం పత్తికొండకు వచ్చిన ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫ్రీ కోచింగ్ సెంటరును ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 13: పత్తికొండ నియోజకవర్గంలో డీఎస్సీ ఫ్రీ కోచింగ్ సెంటరును ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు పెద్దయ్య, హనుమేష్ స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగులు డబ్బులు పెట్టి కోచింగ్‌లు తీసుకోలేక ఇంటి దగ్గరే ఉండిపోతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తే డీఎస్సీకి ప్రిపేర్ అవుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో గేట్ మరమ్మతు పూర్తవుతుంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

పత్తికొండ, ఆగస్టు13: హోస్పేట్‌డ్యాం 7వగేటు మరమ్మతులు వారంరోజుల్లో పూర్తవుతాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పత్తికొండకు వచ్చిన ఆయన మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో మాట్లాడారు. టీడీపీ నేతలతో కలసి డ్యాంగేటును పరిశీలించేందుకు హోస్పేట్‌కు వెళ్లామని అక్కడి మంత్రులతో పరిస్థితిపై మాట్లాడామన్నారు. కర్ణాటక అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి గేటు మరమ్మతు పనులను ముమ్మరం చేయాలని కోరామని తెలిపారు.

ఎమ్మెల్యేకు త్రివర్ణ పతాకం


జాతీయ పతాకాన్ని అందిస్తున్న పోస్టల్ అధికారులు

పత్తికొండ, ఆగస్టు13: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ నుండి హర్ ఘర్ తిరంగకు సంబంధించిన లేఖ, త్రివర్ణపతాకాన్ని పోస్టుమాస్టర్ క్రిష్ణానాయక్, సిబ్బంది మంగళవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు అందించారు. లేఖతోపాటు వచ్చిన త్రివర్ణపతాకాన్ని వారి నుండి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హర్ ఘర్ తిరంగి కార్యక్రమం నిర్వహణ అంశాలతో కూడిన లేఖ కేంద్ర మంత్రి నుండి అందిందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది మీటేనాయక్, సింగం శివశంకర్, మాబు, అంజినయ్య, నరసింహులు ఉన్నారు.

ఆర్‌ఎంపీలు పరిధిని మించి వైద్యం చేస్తే చర్యలు

● ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ

ఆదోని, ఆగస్టు 13: గ్రామాల్లో, మండల కేంద్రాలలో ఆర్‌ఎంపీ వైద్యులు పరిధిని మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ వారి కార్యాలయ ఆవరణంలో ఆదోని మండలంలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యులతో సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యులు యాంటీబయాటిక్ మెడిసిన్ ఇవ్వడానికి కూడా అర్హత లేదన్నారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. జ్వరం, దగ్గు, వొళ్ళునొప్పులు, జలుబు వస్తే వారికి టాబ్లెట్స్ మాత్రమే ఇవ్వాలి. ఒకవేళ 24 గంటలు గడిచిన కూడా తగ్గకపోతే గ్రామాలలో ఉన్న ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాలకు పంపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఫ్లూయిడ్ బాటిల్స్ ఎక్కించరాదన్నారు. గ్రామాల్లో గర్భిణులకు అబార్షన్ చేసి భ్రూణ హత్యలు చేస్తున్నారని వార్తలు వస్తున్నాయన్నారు. ఇలాంటివి చేస్తే పీసీపీ అండ్ యాక్ట్ ద్వార జరినామాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించన ఆర్‌ఎంపీ వైద్యులకు చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డాక్టర్ బాలమురళి పాల్గొన్నారు.

మహిళ విభాగపు నూతన ఓపీ ప్రారంభం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆదోనిలో నూతన బ్లాక్‌లో మహిళ విభాగపు నూతన ఓపీ నామోదు కౌంటర్ మంగళవారం సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించడం కోసమే మహిళ విభాగపు నూతన ఓపీ ప్రారంభించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. అనంతరం హాస్పిటల్‌లో సైటోపథాలజీ, మైనర్ ఓటి ల్యాబ్‌లను మరియు హాస్పిటల్ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెంట్ డాక్టర్ శ్రీరాములు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుంటలు, చెరువులను నింపాలి: సీపీఐ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు13: తుంగభద్ర ప్రాజెక్టు డ్యాం నీరు వృథా కాకుండా చూడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎల్లెల్సీ కార్యాలయంలో ముందు సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీఉల్లా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, భాస్కర్‌యాదవ్, చిన్నన్న మాట్లాడుతూ తుంగభద్ర ప్రాజెక్టు డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిందన్నారు. దీంతో ప్రాజెక్టులోని నీటి నిల్వ లేకుండా పోతుందన్నారు. ఈ ప్రాజెక్టు నుండి ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు ఖరీఫ్‌లో 43,515 ఎకరాలకు రబీలో 1.15లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 190 గ్రామాలకు తాగునీటికి ప్రాజెక్టు నుంచి 20 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా 12టీఎంసీల నీరు కూడా రావడం లేదన్నారు. ఎల్లెల్సీ అధికారులు వృథాగాపోయే నీటిని కుంటలు, చెరువులకు మళ్లిస్తే కొన్ని నెలల పాటైనా రైతులు, ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు తప్పే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాలిక్, దాదావలి, విజయేంద్ర, రాజీవ్, మల్లికార్జునగౌడు, ఖాజా, నరసింహులు, రహిమాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వేళలను మార్చాలి


విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

గోనెగండ్ల, ఆగస్టు 13: వ్యవసాయ పంట భూములకు సరఫరా అయ్యే విద్యుత్ వేళలను మార్చాలని గంజహళ్లి గ్రామ సర్పంచ్ రాముడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డితోపాటు మరో 50 మంది రైతులు కోరారు. మంగళవారం గంజహళ్లి గ్రామానికి చెందిన నాయకలు, రైతులు గోనెగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్‌లో ఉన్న విద్యుత్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరరెడ్డి, మల్లేష్, విజయ్,, వెంకటరాముడు, రాముడు, దరగయ్య, వీరేష్‌వీరబద్రాచారి, రంగస్వామి రైతులు పాల్గొన్నారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన రాజమౌళి, రాజశేఖర్ రెడ్డి అనేభక్తులు చెరో రూ.లక్ష ప్రకారం రూ.2 లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. మంగళవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానానికి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

చోరీ చేస్తుండగా పట్టుబడ్డ దొంగ

వెల్దుర్తి, ఆగష్టు, 13: పట్టణంలో పట్టపగలే దొంగతనం చేస్తూ దొంగ దొరికిపోయిన ఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. గద్వాల ప్రాంతానికి చెందిన అశోక్‌కుమార్‌రెడ్డి మంగళవారం పట్టపగలు పట్టణంలో కోళ్లఫారం దగ్గర సురేష్, రామాంజనమ్మ ఇళ్లలో చోరీ చేశాడు. మంగళివీధిలో శివ ఇంటిలో చోరీచేసిన అనంతరం పక్కనే ఉన్న ముల్లా వీధిలో షేక్షా ఇంటిలో చోరీ చేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి వ్యక్తి షేక్షా ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించాడు. స్థానికులు సాయంతో దొంగను పట్టుకొని పోలీసులకు చరవాణి ద్వారా సమాచారం అందించాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్, ఆగస్టు 13 : పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతుందని, సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న ఎమ్మెల్యే పార్థసారధిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కొందరు వ్యాపారులు రహదారులపై అక్రమ కట్టడాలు నిర్మించడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు.

విద్యారంగాన్ని కాపాడేందుకు పోరాడుతాం : ఎస్ఎఫ్ఐ



ప్రసంగిస్తున్న ప్రసన్నకుమార్

ఎమ్మిగనూరు, ఆగస్టు13: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి నిరంతర పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని తేరుబజారులో ఉన్న పద్మశాలి కల్యాణమంటపంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా 47వ ప్లీనరీ సమావేశాలు జిల్లా అధ్యక్షుడు రంగప్ప అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు రంగప్ప ఎగురవేశారు. ప్లీనరీలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మాలకొండయ్య, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు నాగమణి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు నరసింహ పాల్గొన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి చిన్న పాఠశాలలను రద్దు చేయకుండా ఎస్ఎఫ్ఐ కాపాడిందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో నూతన విద్యావిధానాన్ని వేగంగా అమలు చేసిందని డాక్టర్ మాలకొండయ్య అన్నారు. దావీదు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఒక ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవి, నాయకుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

నందవరం, ఆగస్టు 13: మండలంలోని గంగవరం గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాన్ని, ఎంపీయూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం తహసీల్దారు శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ రికార్డులు పరిశీలించారు. మెను ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. ఈయనతో పాటు ఆర్ఐ జర్మీయా ఉన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని...

ఆదోని రూరల్, ఆగస్టు 13: ఆదోని మండలం ఆరేకల్లుకు చెందిన హుసేని మద్యానికి బానిస అయ్యాడు. సోమవారం భార్య మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురైన హుసేని ఇంట్లోకి వెళ్లి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలుకా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలూరు ప్రాంతంపై దృష్టి సారించాలి

● మంత్రి టీజీ భారత్‌కు టీడీపీ నేత నారాయణ రెడ్డి వినతి


మంత్రితో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

ఆలూరు, ఆగస్టు 13: ఆలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మంగళవారం మంత్రి టీజీ భారత్‌ను టీడీపీ తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి కోరారు. మంగళవారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఆలూరు ప్రాంతంలో జింకలు అధికంగా సంచరిస్తూ పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, వెంటనే జింకల పట్టివేతకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పత్తిని నమిలేస్తున్న తలమాడు తెగులు

గోనెగండ్ల, ఆగస్టు 13: పత్తి పంటకు తమాడు తెగులు వైరస్ సోకుతుండడంతో పంట పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన పత్తి పంట భూములను వారు పరిశీలించారు. పత్తి పంటకు తమాడు తెగులు వైరస్ సోకినట్లు వారు గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు స్వతంత్ర్య ఉత్సవాలను జరుపుకుందాం

● ఎమ్మెల్యే పార్థసారథి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, ఆగస్టు 13: వారం రోజులపాటు స్వాతంత్ర్యోత్సవాలను ఘనంగా జరుపుకుందామని, ప్రతి ఇంటి, వ్యాపార సముదాయంపై మువ్వన్నెల జెండాను ఎగురవేద్దామని ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుండి ఏఎఎస్ కళాశాల, తిక్క స్వామి దర్గా, భీమా సర్కిల్, శ్రీనివాస్ భవన్ కూడలి మీదుగా ఏరియా ఆసుపత్రి వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టును ప్రజలందరూ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర కుమార్, రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, ఆదోని అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, యువ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి, జిల్లా అధ్యక్షుడు కేశవరాం చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, నగర అధ్యక్షుడు శ్రీకాంత్, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, నాయకులు మధుసూదన్ శర్మ పాల్గొన్నారు.

ఉపాధిపై బహిరంగ సమావేశం


ఉపాధిపై బహిరంగ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి, ఆగస్టు 13: 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 14 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో జరిగిన 10 కోట్ల ఉపాధి నిధులపై డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బహిరంగ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన విచారణను బహిరంగ సమావేశంలో చదివి వినిపించారు. రూ. 69208లను రికవరీకి ఆదేశించారు. అలాగే రూ. 27వేల లను పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో అడిషనల్ పీవో మాధవిలత, ఏపీడి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలల్లో పడొద్దు

ఆలూరు, ఆగస్టు 13: సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని ఆలూరు ఎస్ఐ సీవి నరసింహులు సూచించారు. మంగళవారం ఆలూరు మండలం హులేబీడు గ్రామంలో సైబర్ మోసాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు మీకు ఫోన్ చేసి ఆధార్ నెంబర్లు, అకౌంట్ నెంబరు అడిగితే చేప్పకూడదన్నారు. అలాంటి ఫోన్లు వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

సాగు నీరు వదలాలి

దేవనకొండ, ఆగస్టు 13 : మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మండలంలో హంద్రీనీవా ద్వారా సాగునీరు ఇవ్వాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ జయ్యన్నకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు సాగునీరు వదలాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న వాడుకోలేని దుస్థితి కర్నూలు జిల్లా రైతాంగాన్నికి నెలకొందన్నారు. మండలంలో హంద్రీనీవా కాలువలకు తక్షణమే నీళ్లు వదిలితే పంటలను కాపాడుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. యూసుఫ్‌బాషా, మహబూబ్, రైతులు ఉన్నారు.

సరళరుణ విధానంతో మరింత సేవలు

పత్తికొండ, ఆగస్టు 13: ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ నూతనంగా ప్రవేశపెట్టిన సరళరుణ విధానం ద్వారా ఖాతాదారులకు మరింత సేవలు అందుబాటులోకి రానున్నాయని బ్యాంక్ జీఎం పట్లేట్వర్ అన్నారు. పత్తికొండ శాఖలో మంగళవారం ఆయన సరళరుణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈపథకం ద్వారా రైతులకు టర్మ్‌లోన్లు, వ్యాపారస్థులకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం, గృహరుణాలు, మార్టుగేజ్ లోన్లు ఖాతాదారులకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం నవీన్‌కుమార్, సీనియర్ మేనుజర్లు మారుతి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, జబివుల్లాఖాన్, బీఎం వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎంపిక

ఆదోని టౌన్, ఆగస్టు 13: కర్నూలు జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా కార్యదర్శిగా గిరిజ వాణిను ఎంపిక చేయడం జరిగిందని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పార్టీ పురోభివృద్ధి కోసం నిజాయితీగా, నిబద్ధతతో వ్యవహిరస్తూ, సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనాలని, ప్రజా సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్ట పరచాలని సూచించడం జరిగిందని ఆయన తెలిపారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం జరగాలి

మంత్రాలయం, ఆగస్టు 13: మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న కురువ పార్వతి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థోమాస్, వీరేష్‌లు అన్నారు. మంగళవారం మంత్రాలయం జూనియర్ కళాశాలలో విద్యార్థి తల్లిదండ్రులు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో 17న మంత్రాలయం నియోజకవర్గ స్థాయిలో విద్యాసంస్థలకు బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు.

పంటల నమోదు తప్పనిసరి

హాలహర్వి, ఆగస్టు 13: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో శివశంకర్ అన్నారు. మంగళవారం గ్రామస్థాయి ఏటల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి పంటల నమోదు చేయాలని, లేకపోతే ప్రభుత్వ బీమా పథకం, పంటల కొనుగోలు వంటివి అందవన్నారు. అందువల్ల భవిష్యత్తులో రైతులు ఇబ్బందులు పడకుండ చూడలని తెలిపారు.

క్రిమిలేయర్ అమలు దిశగా జైభీమ్ ఎమ్మార్పీఎస్


మాట్లాడుతున్న చిక్కిం జానయ్య

మంత్రాలయం, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలే చేసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో క్రిమిలేయర్ అమలు దిశగా జైభీమ్ ఎమ్మార్పీఎస్ కృషి చేస్తుందని జైభీమ్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్నలు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ జిల్లా యూనిట్ కేంద్రంగా వర్గీకరణ చేయాలని ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామమని అన్నారు. ఎస్సీలోని చాలా ఉప కులాలు హర్షించదగ్గ న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు యోహాన్, రత్నం, రాజేష్, ఆదాం, రవికుమార్, నరసింహులు పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో దీనిని పురస్కరించుకుని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనతో కలిసి వచ్చేవారితో త్వరలో సమావేశం నిర్వహించి కార్యకర్తలతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఉద్యమంలో ఎంతో మంది ఇబ్బందులు పడినా తన వెంట నడిచారని గుర్తు చేశారు.

హామీలను అమలు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 13 : ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని, ఇంతవరకు పథకాలను అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. వెంటనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలున వీన్,నన్నీ,వినయ్,సిద్ధూ,ఎల్లప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 13 : ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆపాస్ సంఘం నాయకుడు ఏ.రంగస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని నీలకంఠేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆపాస్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఏ.రంగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ జీవో 117ను రద్దు చేయాలని, సీబీఎస్ స్కూల్‌లలో కూడా హిందిని కొనసాగించాలని ,అన్ని పాఠశాలలో తెలుగు మీడియం కొనసాగించాలని, వేతన సవరణ కమీషన్ చైర్మన్‌ను నియమించాలని, మధ్యంతర భృతి ఐఆర్ 25శాతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, గురుపూజిత్, కృష్ణ, నాగభూషణం, బజారి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


వినతి పత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

ఆలూరు, ఆగస్టు 13: మండలంలోని హులేబీడు ఎంపీపీఎస్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని మంగళవారం ఆలూరు ఎంఈవో కోమల దేవిను కలిసి విద్యార్థులు తల్లిదండ్రులు వినతి పత్రం అందించారు. పేరుకే తప్ప పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేవని, గదుల కొరత ఉందన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్య శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్కూల్‌లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని మరో టీచర్‌ను నియమించాలని కోరినట్లు ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పరమేష్ తెలిపారు.

సీపీఎం విరాళాల సేకరణ

ఆస్పరి, ఆగస్టు 13: కేరళ రాష్ట్రం వయనాడు వరద బాధితులను ఆదుకునేందుకు మండల సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో వరదల వల్ల వయనాడు ప్రాంతం చిన్నాభిన్నమైందని తెలిపారు. వారిని ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సుమారు రూ.10150 సేకరించామని, ఆ నగదును సీపీఎం కేంద్ర రాష్ట్ర కార్యాలయాలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రంగస్వామి, రామాంజినేయులు, వెంకటరాముడు, కైరుప్పల రామాంజినేయులు, కాశన్న పాల్గొన్నారు.

'ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగుతుంది..'

ఆదోని టౌన్, ఆగస్టు 13: పట్టణంలోని వైఎంకై హైస్కూల్ భవనంలో గత ఏడాది కాలంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అదే భవనంలో యధావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే డా. పార్థసారధి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి అద్దె చెల్లించకపోవడంతో యాజమాన్యం ఖాళీ చేయాలని ఒత్తిడి చేశారు. ఎమ్మెల్యే యాజమాన్యం చెన్న బసప్పతో మాట్లాడి ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో డిగ్రీ కళాశాల కొనసాగింపునకు యాజమాన్యం అంగీకరించిందన్నారు.

16 నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 13: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీ నుంచి మొదటి సంవత్సరం డిగ్రీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వంద మంది విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కలాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వెబ్ ఆప్షన్ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చేరెందుకు ఆప్షన్ ఇచ్చారన్నారు. వారందరికీ సమాచారం ఇస్తామని చెప్పారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెండవ విడత ఆప్షన్‌లోనూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంటుందని తెలిపారు. బీకాం (కంప్యూటర్స్), బీఏ (ఎకనామిక్స్) బీఎస్సీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కోసిగి, ఆగస్టు 13: రాయచూరు నుంచి కోసిగి వైపు వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి కోసిగి చెందిన వడ్డె ఎల్లప్ప అనే యువకుడు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని రాయచూరుకు పని కోసం వెళ్లి మంగళవారం సాయంత్రం ఎక్స్‌ప్రెస్ రైలులో కోసిగికి వస్తుండగా.. ఐరంగల్ రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు దూరంలో రైలు నుంచి కింద పడ్డాడు. స్థానికులు 108లో ఆదోని ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిప్పగిరి ఆగస్టు 13: చిప్పగిరి మండలం నగర డోణ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లుకు చెందిన సుగుణ (46) అక్కడికక్కడే మృతి చెందింది. గుంతకల్ నుంచి ద్విచక్ర వాహనంలో భర్త చందుతో కలిసి సుగుణ రామదుర్గం గ్రామానికి వెళుతుండగా ఆలూరు వైపు నుంచి వస్తున్న వాహనం వీరిని నగర డోణ వద్ద ఢీ కొట్టింది. 108 వాహనంలో గుంతకల్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే సుగుణ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సుగణ భర్త చందు గాయపడగా గుంతకల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.